

అతి శుభ్రత, అనన్య క్రమశిక్షణ, అనంత సాహిత్య తృష్ణ, అవిరళ జిజ్ఞాస, అసదృశమైన వ్యాకరణ కుశలత, అచిరమైన పాలపొంగులాంటి ముక్కోపితనం, ఆవగింజంత ఛాదస్తం, అక్కజమైన ఆర్ద్రత, అతిశయించిన మానవీయత అన్నీ కలిస్తేనే మా మేస్టారు రోశయ్యగారు.

# నాకు తెల్సిన మా మాస్టారు రోశయ్యగారు

శ్రీ పాతూరి విజయకుమార్

## పరిచయం

నేను 1952లో గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కాలిజ్‌కి ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్ కోసం వెళ్లినప్పుడు, మా నాన్నగారు ఆ కాలిజ్‌లో ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేస్తూన్న శ్రీ ఎలవర్తి రోశయ్య (YR)గారి వద్దకు తీసికొని వెళ్లి పరిచయంచేసి, నన్ను వారి ఆశీస్సులు తీసుకోమన్నారు. అప్పుడు చూశాను వారిని దగ్గరగా. అదే నాతొలి పరిచయం వారితో. మధ్య పాపిడి, కొనతేలిన ముక్కు, నున్నగా (మీసాలతో సహా షేవ్ చేసుకొన్న) గడ్డంతో, తీక్ష్ణమైన చూపులతో, ఒక live wire లాగా నాకు కన్పించారు వారు. అంతకుముందు నేను హైస్కూలు విద్యార్థిగా, కాలేజ్‌కు ఆనుకొని వున్న ULCM హైస్కూలులోనే చదువు కోవడం వలన వారిని గురించి చాలా గొప్పగా విన్నాను.

ఆ తరువాత 1968లో నేను నాగపూరు విశ్వవిద్యాలయ గ్రంధాలయం నుంచి, గుంటూరులోని జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి కళాశాల (JKC) గ్రంధాలయానికి లైబ్రేరియన్‌గా రావడం జరిగింది. గుంటూరు మా స్వంత ఊరు కావడంతో ఉద్యోగంలో ఈ మార్పు, నియామకం కూడా మాకు సంతోషాన్ని

కల్గించింది. నేను గుంటూరు JKCలో చేరినప్పటినుంచి, శ్రీరోశయ్యగారు ప్రిన్సిపల్‌గా రిటైరయ్యి తరువాత చనిపోయే వరకు కూడా నాకు వారితో ఉద్యోగరీత్యానే గాక వ్యక్తిగతంగా కూడా (దాదాపు రెండు దశాబ్దాల పైగా) సన్నిహిత సంబంధాలు వుండేవి.

కళాశాలలో నేను లైబ్రేరియన్‌గా చేరిన తరువాత, నా ఉద్యోగం సమర్థవంతంగా నిర్వహించడానికి వారి సహకారం ఎంతైనా అవసరం అని, అది వారు తప్పక నాకు అందిస్తారని ఆశిస్తున్నానని వినయంగా వారితో అన్నాను. దానికి వారు ''you will get it as long as you deserve and desire it.'' అన్నారు. ఆనాడు వారు అన్న ఈ మాటలు ఎప్పుడూ, ఉద్యోగం చేస్తూన్నంత కాలం మదిలో మెదుల్తూ వుండేవి. Those words were not only full of wisdom but at the same time proved to be inspiring and thought provoking in my case during my service in the college.

## ప్రిన్సిపల్‌గా శ్రీ YR

జేకేసీ కాలిజ్ ప్రిన్సిపల్‌గా వీరు ఒక కొత్త ఒరవడి సృష్టించారు. చాలా కళాశాలల్లో ఆయా సంస్థల ప్రాముఖ్యాన్ని బట్టి ప్రిన్సిపల్ పదవి అలంకరించిన వ్యక్తులకు కీర్తి ప్రతిష్ఠలు అయాచితంగా లభిస్తుంటాయి. కాని శ్రీ YR విషయంలో అలాగాక వీరు ప్రిన్సిపల్‌గా వుండటం వలననే మా కళాశాలకు ఆంధ్రదేశమంతటా ఒక ప్రత్యేక గుర్తింపు, పేరుప్రతిష్ఠలు లభించాయి. ఇది వాస్తవం.

కళాశాల ప్రిన్సిపల్‌గా వీరు మంచి సంప్రదాయాలకు, చెరగని విలువలకు పెద్దపీట వేశారు. స్టాఫ్ సెలక్షన్ అయినా, విద్యార్థుల అడ్మిషన్లు అయినా సరే, ఒక్క మెరిట్‌కే ప్రాధాన్యం ఇచ్చేవారు. ప్రభుత్వం, విశ్వవిద్యాలయాధికారులు, ఆఖరికి కళాశాల మేనేజిమెంట్‌వారు సిఫార్సు చేసినా సరే లెక్క పెట్టేవారు కాదు. ఈ విషయంలో వీరు చాలా నిక్కచ్చిగా, మొండిగా ప్రవర్తించేవారు. వ్యక్తిగతంగా కూడా నాకు ఈ విషయాలు తెలుసు.

## సెక్రటరీ సిఫారసు : బయటకు విసరికొట్టబడ్డ అప్లికేషన్

కొత్తగా కళాశాల స్థాపించిన రోజుల్లో, ఒకసారి అప్పట్లో కళాశాల వ్యవస్థాపక సెక్రటరీగా పని చేస్తున్న డాక్టర్ సదాశివరావుగారు ప్రిన్స్‌పల్‌గారి ఆఫీసుకు ఆనుకొనివున్న మేనేజిమెంట్‌వారి గదిలో కూర్చొని, అటుగా వెళ్తున్న నన్ను పిలచి, ఒక కుర్రవాని అప్లికేషన్ నాచేతికి ఇచ్చి ''ప్రిన్సిపల్‌గారి వద్దకు వెళ్లి నేను చెప్పానని చెప్పి దీనిపై Admit అని రాసి సంతకం చేయించుకొని రా'' అన్నారు. అమాయకంగా ఆ అప్లికేషన్ తీసుకొని ప్రిన్సిపల్‌గారి వద్దకు వెళ్లి సంతకం చేయమని అడిగాను. అంతే, ఒక్కసారిగా ఆయన ఉగ్రరూపం దాల్చి, అప్లికేషన్ విసరి బయటకు కొట్టి, ఎవరు ఇచ్చారు నీకు ఇది అని గద్దించారు. నేను చిన్న బుచ్చుకొని మాట్లాడకుండా బయట పడ్డాను. ప్రక్కగదిలోని డాక్టరుగారు ఇదంతా గమనిస్తూనే వున్నారు. కిమ్మన లేదు సరికదా! పైగా ముసిముసి నవ్వులు నవ్వుకొంటూ కన్పించారు.

అప్పటి మా కళాశాల వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ జాగర్లమూడి చంద్రమౌళిగారు కూడా ప్రిన్స్‌పల్‌గారి వైఖరి గురించి చాలాసార్లు మీటింగుల్లో ప్రశంసా పూర్వకంగా చెప్పేవారు. అంతేగాక కళాశాల మేనేజ్‌మెంట్‌వారు కూడా ఇలాంటి సందర్భాల్లో ప్రిన్సిపాల్ గార్కి పూర్తి స్వాతంత్ర్యం ఇచ్చి చాలా హుందాగా ప్రవర్తించేవాళ్లు. అంతేగాక ప్రిన్సిపల్‌గారు అలా వ్యవహరిస్తున్నందుకు కష్టపెట్టుకోకుండా పెద్ద మనస్సుతో నిజంగా గర్వించేవాళ్లు. అదీ ఆనాటివాళ్ల సంస్కారం.

## సమయపాలన

శ్రీ YR punctuality విషయంలో చాలా శ్రద్ధగా వుండేవారు. స్టాఫ్‌గాని, స్టూడెంట్స్‌గాని కాలిజ్‌కు సరైన టైముకు రాకపోతే సహించేవారుకాదు. పనిదినాల్లో ఉదయం 10 గంటలు కాగానే శనివారాల్లో అయితే ఉదయం 8-30కు Attendance Registerను ఆఫీసు నుంచి వారి గదిలోని టేబుల్ పైకి మార్చేవారు. ఆలస్యంగా వచ్చినవాళ్లు ఎంత

సీనియర్లయినా వారి గదిలోకి వెళ్లి explanation ఇచ్చుకొని, ఆకాసిని అక్షింతలూ వేయించుకొని సంతకం చేసేవారు. ఇది వారి సుగ్రీవాజ్ఞ. ఎవ్వరికీ జవదాట వీలులేనిది. అలాగే థర్డ్‌బెల్ కొట్టిన తరువాత స్టూడెంట్స్ బయట కాంపస్ లో గాని క్యాంటిన్‌లోగాని వుంటే వాళ్ళను చూపులతోనే క్లాసురూంలకు తరిమేవారు. థర్డ్‌బెల్ అవగానే Time Table pad పట్టుకొని, ప్యూన్ వెంకట్రావు, Waterman సాంబశివరావులు వెంటరాగా ఆయన అన్ని క్లాసురూంలు విజిట్ చేసేవారు. ఒకవేళ ఎప్పుడైనా కథాజిత్తుగా, సంబంధిత లెక్చరర్ థర్డ్‌బెల్ అయినా కూడా క్లాసురూంలో లేకపోతే, ఆ లెక్చరర్ వచ్చేవరకూ అక్కడే వేచి వుండి అవసరం అయితే ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసిగాని కదిలేవారు కాదు. కాలేజ్ పనిదినాల్లో వారి నిత్యకృత్యం ఇది.

## పరీక్షల నిర్వహణ

శ్రీరోశయ్యగారు తాను పూర్వం పని చేసిన గుంటూరులోని ఆంధ్ర క్రిస్టియన్ కాలేజ్‌వారు పాలనాపరంగాను, విద్యావిషయికంగాను అనుసరించే అనేక పద్ధతులను మా కళాశాలలో ప్రవేశపెట్టి మంచి ఫలితాలు సాధించారు. ముఖ్యంగా పరీక్షల నిర్వహణలో వీరు foolproof విధానాన్ని మా కళాశాలలో ప్రవేశపెట్టి స్టాఫ్‌కు తగిన తర్ఫీదు ఇచ్చారు. అంతేగాక పరీక్షల నిర్వహణలో టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌లకు సమానమైన ప్రాముఖ్యం ఇచ్చి ఈ రెండు శాఖల మధ్య మంచి సమన్వయం సాధించి గొప్ప సంప్రదాయాన్ని పాదుకొల్పారు. ఇప్పటికీ మా కాలేజ్‌లో ఇదే విధానాన్ని అనుసరిస్తూన్నారు.

వీరి హయాంలో మా కళాశాలలో విద్యార్థులు కాపీ కొట్టడమనేది జరిగేది కాదు. కాలేజ్ స్టాఫ్ అంతా కలసికట్టుగావుండి పరీక్షల నిర్వహణలో అత్యంత శ్రద్ధాభక్తులు కనబరచి దీన్ని ఒక పవిత్ర యజ్ఞంలా ఆదర్శవంతంగా నిర్వహించేవారు. వీరి హయాంలో పబ్లిక్ పరీక్షలలోనే కాదు, క్వార్టర్లీ పరీక్షలలోనైనా సరే మరుసటి రోజు ఏరూంకు ఎవరు invigilatorగా వస్తారనే విషయం బయటకు

పొక్కకుండా అత్యంత గోప్యంగా వుంచేవారు. ఇది శ్రీYR పాలనా దక్షతకు మచ్చుతునక. నాగార్జున యూనివర్సిటీవారు నిర్వహించాల్సిన Post Graduate examsను మా కళాశాల వారిని నిర్వహించమని కోరిన సందర్భాలు అనేకం వున్నాయి.

## ప్రయివేట్ ట్యూషన్లు

కాలిజ్ లెక్చరర్లు ఇంటివద్ద దుకాణాలు పెట్టి విద్యార్థులను అనేక విధాలుగా ఆకర్షించి ట్యూషన్లు చెప్పుకోడానికి వీరు పూర్తిగా వ్యతిరేకం. ఇది వీరు నమ్మిన సిద్ధాంతాల్లో ఒకటి. మేనేజ్‌మెంటు వారు ఈ విషయంలో వీరికి పూర్తి మద్దతు ఇచ్చారు. అయితే చదువుల్లో వెనకబడ్డ విద్యార్థులుంటే వారికి కళాశాల ప్రాంగణంలోనే మేనేజ్‌మెంట్‌వారు నిర్ణయించిన ట్యూషన్ ఫీజుకి కట్టుబడి, తగుమాత్రపు విద్యార్థులకు కళాశాల పని గంటలలో కాక మిగతా సమయాల్లో ట్యూషన్ చెప్పుకోడానికి కొంతకాలం తరువాత వీరు అనుమతించారు. అయితే ఈ విధానం ద్వారా తమకు వచ్చే పారితోషికం స్వల్పంగా ఉండటంతో లెక్చరర్లలో అధిక శాతంమంది దీనికి వ్యతిరేకత వెలిబుచ్చారు. ఈ విషయంలో మేనేజ్‌మెంట్ ప్రిన్సిపల్‌గార్నే సమర్థించడంతో, వీరి హయాంలో చాలావరకు లెక్చరర్లు ఇంటివద్ద విద్యార్థులకు ప్రయివేట్ ట్యూషన్స్ చెప్పకుండా నిరోధించి తమ పంతం నెగ్గించుకొన్నారు. కాని తరువాత కాలంలో ఈ విధానాన్ని సడలించి మేనేజ్‌మెంటువారు కొంత పట్టువిడుపు విధానాన్ని ప్రదర్శించి కాలానుగుణంగా వ్యవహరించారు.

ఇంటివద్ద ప్రయివేట్‌గా ట్యూషన్ చెప్పే విధానమన్నా లేదా అలా చెప్పే వ్యక్తులన్నా శ్రీ YR కు చాలా తిరస్కార భావముండేది. దీనికి ఒక్క ఉదాహరణచెప్తాను. గతంలో జే.కే.సి.లో చేరకముందు శ్రీ Y.R. ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో సహోధ్యాపకులుగా వుండేవారు. అప్పట్లో శ్రీ జాస్తి వెంకటేశ్వర్లు (J.V.) కెమిస్ట్రీలో ట్యూషన్లు చెప్పేవారు. J.K.C.లో కెమిస్ట్రీ హెడ్‌గా చేరిన తరువాత ట్యూషన్ చెప్పడం మానివేశారు. అయినా కూడా శ్రీ Y.R. శ్రీ J.V. అంటే గుర్రుగానే

వుండేవారు. ఆయన ఉద్దేశంలో ప్రస్తుతం ట్యూషన్ చెప్పక పోయినా శ్రీ J.V. ఒకప్పుడు చెప్పేవారు అనే సంగతి మర్చిపోలేక వారిని ఆక్షేపించేవారు. చిన్నమెత్తు మానవసహజ బలహీనతలను కూడా వీరు సహించేవారుకారు. అంతా ముక్కుసూటితనమే, ఋజుప్రవర్తనే. అభిమానధనులు. లౌక్యం అసలే లేదు. అందుకే కాబోలు వారికి Retirement తరువాత ప్రిన్సిపల్‌గా extension లభించలేదు.

## హరిజన బాలిక: EC comలో సీటు

గుంటూరులో మాఇంటి ఎదురుగా వున్న జార్జిపేటలో, నాకు బాగా తెలిసిన ఒక పేద హరిజన కుటుంబంలోని అమ్మాయి టెన్త్‌క్లాస్ మామూలు మార్కులతో ప్యాస్ అయ్యింది. వాళ్ల నాన్న కాలేజిలో అమ్మాయిసీటు కోసం నావద్దకు వచ్చాడు. సిఫార్సులంటే ప్రిన్సిపాల్‌గార్కి నచ్చదని తెల్సికూడా, సంశయిస్తూనే మరునాడు ఆపాపను వెంటబెట్టుకొని వెళ్లి ప్రిన్సిపల్‌గారితో విషయం అంతా వివరంగా చెప్పాను. ఏ బ్రాంచిలో ఇచ్చినా సరే, సీటు దొరికితే అదే పదివేలు అని మనస్సులో అనుకొన్నాను. వారు ఆపాపను, మార్కుల షీట్‌ను పరిశీలించి, EC Comలో అడ్మిషన్ ఇచ్చారు. అప్పట్లో JKCలో average మార్కులు వచ్చిన వారికి, ఒక్క మేనేజ్‌మెంట్ కోటాలో తప్ప, EC Comలో సీటు లభించడం గొప్పవిశేషమనే చెప్పాలి. క్రమంగా ఆపాప మాకాలేజిలో Inter, B.comలు పూర్తిచేసి తరువాత M.Com చదివి, కాలేజి ప్రక్కనేవున్న ఇండియన్ బ్యాంకులో క్లర్క్‌గా ఉద్యోగంలో చేరింది. ఇప్పుడు పెద్ద బ్యాంకు ఆఫీసరై, వివాహం చేసుకొని సుఖంగావుంది. ఈ అమ్మాయి పేరు కొప్పుల శ్రీదేవి. ప్రిన్స్‌పల్‌గారి సహృదయతకు, నిష్పాక్షికతకు ఇది ఒక తార్కాణం మాత్రమే.

## స్కాలర్‌గా శ్రీ YR

ఒక్క ముక్కలో చెప్పాలంటే, రోశయ్యగార్ని The Scholar extraordinary both in English and Telugu అని వర్ణించాలి. ఆంగ్ల,

ఆంధ్ర సాహిత్యాలరెంటినీ వీరు ఆపోశనం పట్టారు. వ్యాకరణం, ఉచ్చారణ వీరి అభిమాన విషయాలు. ధారాళంగా వేదికలు ఎక్కి ఉపన్యసించడంగాని, పుంఖాను పుంఖాలుగా రచనలు వెలువరించడంగాని వీరు చేయలేదు. కాని వీరు quite an engaging and interesting conversationalist - అని చెప్పాలి. సరస సంభాషణా చతురులు. ప్రముఖ వ్యక్తులకు సంబంధించి అనేక ఆసక్తికరమైన anecdotes, హాస్య సంఘటనలు వీరు సంభాషణల్లో గుప్పించేవారు.

ఎంతటి పండితులు వెలువరించిన రచనల్లోనైనా సరే వ్యాకరణ దోషాలను వెంటనే పట్టివేసి ఎత్తిచూపేవారు. వ్యాకరణంపై వీరు సల్పిన అమితకృషే వీరి పట్ల ఒకవిధమైన శాపంగా పరిణమించిందని చెప్పాలి. వీరి అసమాన పాండిత్యప్రతిభావ్యుత్పత్తులు వీరి సృజనాత్మకతను హరించివేశాయేమో అనిపిస్తుంది. రాత బలికోరుతుందని వీరు అంటూవుండేవారు. వీరిలో అంతర్గతంగావున్న ఈ విశ్వాసమే వీరి ఆలోచనా అమృతాన్ని, విజ్ఞాన సంపదను మనకు దక్కకుండాచేసింది. సాహిత్య విమర్శలో వీరిది అందెవేసిన చెయ్యి. విలక్షణమైన విమర్శనా శైలి వీరిలోదాగివుంది. అయితే అంతా మౌఖికంగానే తరగతి గదుల్లోను, సంభాషణల్లోను వెల్లివిరిసేది. వీరి విమర్శన ఏది గ్రంథస్థంకాలేదు. అలా చెయ్యడానికి వీరు ఎప్పుడూ ప్రయత్నించలేదు. దీని వలన సాహిత్యలోకం చాలా పోగొట్టుకొంది.

## సామాన్యపదాలు: ఉచ్చారణ: వర్ణక్రమం

శ్రీ YR సమక్షంలో నోరుతెరచి ఇంగ్లీషులోకాని, తెలుగులోకాని మాట్లాడాలంటే చాలా మందికి బెరుకుగానే వుండేది. నిజమైన చదువంటే డిగ్రీలు, బిరుదులుకాదు అసలు డొక్కశుద్ధివుండాలి అనేవారు. సాధారణంగా మనం వాడేమాటల్లోని అనేక ఉచ్చారణా దోషాలను వీరు పట్టిచూపేవారు. 'Dais'ను 'డయాస్' కాదు 'డయీస్' అని; 'Clerk'ను 'క్లర్క్' కాదు 'క్లార్క్' అని; 'Mortgage'ను మోర్టిగేజ్‌కాదు 'మాగిజ్' అని; 'Russia'ను రష్యాకాదు 'రషా' అని;

'Paradise Lost'ను 'ప్యారడైజ్ లాస్ట్' కాదు 'ప్యారడైస్‌లాస్ట్' అని; 'Tortoise'ను టార్టాయిస్' కాదు 'టాటస్' అని; 'Doctor'ను 'డాక్టర్' కాదు 'డోక్టర్' అని; 'Ohio'ను 'ఓహియో'కాదు 'ఒహాయో'అని; 'Chicago'ను చికాగోకాదు 'షికాగో'అని; 'Leisure'ను 'లీజర్'కాదు 'లెజర్'అని; 'Book'ను 'బుక్'కాదు 'బక్'అని; 'College'ని 'కాలేజి'కాదు'కాలిజ్'అని; 'Nazi'ని 'నాజీ'కాదు 'నాట్సీ'అని పలకాలని చెప్పేవారు. ఇలా ఎన్నెన్నో పదాలను సామాన్యులే గాక మాన్యులు కూడా ఉచ్చరించటంలో తప్పుచేస్తున్నారని వాపోయేవారు.

అలాగే తెలుగు పదాల వర్ణక్రమంలో కూడా మనం సాధారణంగా వాడుకలో చేసే తప్పిదాలను సూచించేవారు. 'హంతకుడు' కాదు 'హంత' అని, 'మల్లిఖార్జునుడు' కాదు 'మల్లికార్జునుడు' అని; 'వెంకటేశ్వరరావు'కాదు 'వేంకటేశ్వరరావు' అని; 'షష్ఠిపూర్తి' కాదు 'షష్టిపూర్తి' అని; 'కాళ్ళు' కాదు 'కాళ్లు' అని రాయాలని చెప్పేవారు.

## స్వంత గ్రంథాలయం

శ్రీ YR వద్ద మంచి విలువైన స్వంత లైబ్రరీవుండేది. దీన్ని కంటి పాపలాగ చూసుకొనేవారు. ముఖ్యంగా ఇంగ్లీషు, తెలుగు సాహిత్యాల్లోని అనేకానేక Classics, వాటి వివిధ ఎడిషన్లు వాటిపైన కామెంటరీలను, కామెంటరీలపై కామెంటరీలను శ్రద్ధగా సేకరించి తమ లైబ్రరీలో భద్రపరచారు. ప్రతిష్ఠాత్మకమైన అనేక నిఘంటువులను, అట్లాసులను వాటి వివిధ ఎడిషన్లను సేకరించారు. సుమతీశతకం, చిన్న, పెద్దబాలశిక్షలనుంచీ బ్రిటానికా ఎన్‌సైక్లోపీడియా వరకు అన్నిరకాలైన విలువగల రచనలను, వాటి విశిష్ట ప్రతులను వ్యయప్రయాసలకోర్చి సంపాదించారు. వీటిని అపురూపంగా చూసుకొనేవారు. తన పుస్తకాలను ఇతరులకు అరువు ఇచ్చేవారుకాదు. భారతి, త్రివేణి, కృష్ణా పత్రిక, ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక, Swarajya, Mother India, Times Literary Supplement మొదలైన పత్రికల పాత సంపుటాలను వీరు సేకరించి వుంచారు.

### గ్రాంథికవాది

వీరు పరమ గ్రాంథికవాది. ఇందులో వీరికి కొక్కొండ వెంకటరత్నం పంతులుగారు పరమఆదర్శం. వ్యవహార భాష అంటే చులకనగా చూడటమేగాక ఈసడించుకొనేవారు. ఆధునికకాలంలో వ్యవహారిక భాషావాదంపై ఎక్కువమంది మొగ్గు చూపడంతో నాల్గుకాలాలపాటు నిలచే శాశ్వత విలువలు కల్గిన ఉత్తమ గ్రంథాలు వెలుగులోకి రావడంలేదని అభిప్రాయపడేవారు. భాషా, సాహిత్యరంగాల్లో విలువలుపడిపోతున్నాయని, ఎక్కువ కాపీలు అమ్ముడుపోయిన ప్రతి రచన విలువైనది కానక్కర లేదనీ చెప్పేవారు. ఒక భాషకు సంబంధించి సాహిత్యంపై పట్టుసాధించాలంటే, ఆ భాషపుట్టిన దేశ సాంఘిక, సాంస్కృతిక, ఆర్థిక చరిత్రలనుకూడా బాగా లోతుగా అధ్యయనం చేయాలని నొక్కిచెప్పేవారు.

## లైబ్రేరియన్‌గా నాదృష్టిలో శ్రీ YR

### పుస్తక ప్రియుడుగా

పుస్తకాలంటే శ్రీ YRగార్కి మహాప్రీతి. అదీ మంచికాగితం మీద బాగా ముద్రించి, అందంగా బైండుచేసిన పుస్తకాలంటే మరీమరీ ఇష్టం. ఒక్కోసారి పుస్తకం తెరచి మధ్యలో వాసనకూడా చూస్తూ సంతోషం వెల్లడించేవారు. వారు 20వ శతాబ్దం పూర్వార్థంలో గుంటూరు ఆంధ్ర క్రిస్టియన్ కళాశాలలో పనిచేస్తున్నప్పుడే తన జీతంలో దాదాపు మూడవ వంతుదాకా పుస్తకాలు పత్రికలు స్వంతానికి కొనుక్కోడానికి ఖర్చు పెట్టేవారని చెప్పుకొనేవారు. ఆకాలంలోనే స్వంతానికి Encyclopedia Britannica మద్రాసు మోర్‌మార్కెట్‌లో సెకండ్ హ్యాండ్ కాపీ కొనుగోలు చేసారు. వీరి స్వంత లైబ్రరీ అనేక అపురూపమైన పుస్తకాలు, పత్రికలు, అట్లాసులు, డాక్యుమెంట్లతో నిండివుండేది. వీరు కాలంచేసిన తరువాత, వీరు సంపాదించిన గ్రంథసంపదలో అధికభాగం అనేక రకాలుగా చేజారగా, మిగతాకొద్ది collectionను కాలేజీమేనేజ్‌మెంట్ వారు మా కళాశాల గ్రంథాలయానికి కొనుగోలుచేయడమైంది.

## పుస్తకాల ఎన్నిక: కొనుగోలు

వీరు ప్రిన్సిపల్‌గా వున్నంతకాలంకూడా, ఇంగ్లీషు తెలుగు భాషా సాహిత్యాలకు సంబంధించిన పుస్తకాలు లైబ్రరీకి ఎన్నిక చేయాలంటే వీరి ప్రమేయం లేకుండా జరిగేదికాదు. ఆయనే స్వయంగా నాతోపాటు పుస్తకాల షాపులకు వచ్చిగాని, లేదా తన ఆఫీసుకు పుస్తకాలను తెప్పించుకొని ప్రతి పుస్తకాన్ని ఆమూలాగ్రం పరీక్షించి మరీ ఎన్నిక చేసేవారు. వీరికి ఆంగ్ల సాహిత్యంలో మిల్టన్ అన్నా, తెలుగులో చిన్నయసూరి అన్నా వల్లమాలిన అభిమానం. కవిత్రయంలో తిక్కనను ఎక్కువగా అభిమానించేవారు. ఆధునిక సాహిత్యం అంటే మరీ ముఖ్యంగా వర్తమాన కల్పనా సాహిత్యం అంటే అసలు గిట్టేదికాదు.

గ్రంథాలయానికి సంబంధించిన పుస్తకాల ఎన్నికలో ఒక్క సైన్స్, కామర్స్ తప్పితే మిగితా దాదాపు అన్ని disciplinesకు సంబంధించిన పుస్తకాలను తానే స్వయంగా పరిశీలించి ఎన్నిక చేసేవారు. అయితే ఇందులో ఎవరూ ఫిర్యాదు చేయడానికి ఆస్కారం వుండేదికాదు. ఎందుకంటే వీరికి స్వయంగా ఆయా విషయాలపై వున్న పరిజ్ఞానం, అవగాహనా శక్తి అంత గొప్పది. ఇందులో సందేహం ఎవరికీ వుండేదికాదు.

## నిరంకుశ ధోరణి : పట్టువిడుపులు

శ్రీ వై.ఆర్. ఎక్కువగా ఓ.యు.పి., క్లారెండన్ ప్రెస్, సి.యు.పి., మ్యాక్‌మిల్లన్, లాంగ్‌మ్యాన్స్ మొదలైన ప్రముఖ విదేశీ ప్రచురణ సంస్థలు, తెలుగులో అయితే వావిళ్ళ, ఎమెస్కో, తెలుగు అకాడమీ, ఆంధ్ర సాహిత్య పరిషత్తు, వివిధ విశ్వవిద్యాలయాలు మొదలైన విశిష్ట ప్రచురణ సంస్థలు ప్రచురించిన రచనలను మాత్రమే కొనుగోలు చేయడానికి అంగీకరించేవారు. వీరికి వ్యక్తిగతంగా కొంతమంది రచయితలంటే గిట్టేదికాదు. వారి రచనలను లైబ్రరీకి కొనుగోలు చేయడానికి సుతరామూ ఇష్టపడేవారు కాదు. కారణం ఏమిటో అడిగి తెలుసుకునే ధైర్యం మా స్టాఫ్‌లో ఎవ్వరికీ వుండేదికాదు.

దీనికి సంబంధించిన ఒక సంఘటన వివరిస్తాను. ఒకసారి నేను మా కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు శ్రీ నాగళ్ళ గురుప్రసాదరావు కలిసి, తెలుగు పుస్తకాల ఎన్నిక నిమిత్తం గుంటూరులోని నవోదయ పబ్లిషర్స్ పుస్తకాల షాపుకు శ్రీ వై.ఆర్.ను వెంటబెట్టుకొని వెళ్ళాం. శ్రీ గురుప్రసాదరావు, విశ్వనాథ వారి రామాయణ కల్పవృక్షం సెట్ ఒకటి లైబ్రరీకి తీసుకొందామనే ఆలోచనతో, బాలకాండ ప్రతినొకదాన్ని రోశయ్య గారికిచ్చి చూడమన్నారు. ఆయన పుస్తకం మధ్యలో తెరచి ఒక పద్యం సగం చదివి దాని నడక, ఛందస్సులోని దోషాలను వెంటనే గురుప్రసాదరావు గారికి ఎత్తిచూపి ''ఛ ఛ, ఇటువంటి పుస్తకాన్ని నన్ను చదవమంటావా! పైగా విద్యార్థుల కోసం లైబ్రరీకి కూడా ఒక సెట్ తీసుకోమంటున్నావా?'' అని మందలించే ధోరణిలో మాట్లాడారు. పుస్తకం విసరి అవతల పారవేశారు. చివరకు ఎలాగో వారికి నచ్చచెప్పగా, ఆ సెట్‌లో ఒక్క బాలకాండ మాత్రం తీసుకోడానికి అంగీకరించారు. విశ్వనాథ వారి 'కిన్నెరసాని' తప్పితే మరే రచనా వీరికి నచ్చేదికాదు. అలా అని విశ్వనాథ వారిపై వీరికి వ్యక్తిగతంగా ద్వేషం ఏమీలేదు. ఆయన రచనల్లో వారు వ్యక్తీకరించిన భావజాలం, ఆలోచనా ధోరణి, వ్యాకరణ నియమోల్లంఘన వీరికి నచ్చేదికాదు. కాని విశ్వనాథ వారి గురువర్యులైన తిరుపతి వేంకట కవులంటే మంచి గౌరవభావం, ఆదరణ కనబరచేవారు.

తెలుగు సాహిత్యంలో పానుగంటివారి 'సాక్షి' వ్యాసాలను, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి అన్ని రచనలనూ అనేక సెట్లు కొనమనేవారు. గురజాడవారి 'కన్యాశుల్కం', చిలకమర్తివారి 'గయోపాఖ్యానం' నాటికలంటే వీరికి అభిమానం మెండు. నవలల విషయానికొస్తే 'బారిష్టరు పార్వతీశం', 'గణపతి' నవలలను పలుమార్లు చదువుకుంటూ తనలోతాను నవ్వుకొంటూ కన్పించేవారు. శ్రీశ్రీ రచనలంటే అంత ఇష్టపడేవారుకాదు. అయిష్టంగానే ''నాకు చూపించకుండా ఏదో మీరు తీసుకోండి'' అనేవారు. రిఫరెన్స్ పుస్తకాలు కొనే విషయంలో నాకు కొంత స్వేచ్ఛనిచ్చేవారు. నేను ఎప్పుడన్నా వారు

ఉల్లాసంగా మంచి మూడ్‌లో వున్నప్పుడు-''స్టూడెంట్స్ గోల చేస్తున్నారండీ, మీరు ఎన్నికచేసే పుస్తకాల స్థాయికి వారు ఎదగలేక, వాటిని చదివి అర్థం చేసుకోలేకపోతున్నారు. కాలం మారింది, చదువరుల అభిరుచులను కూడా మనం గుర్తించాలి. విద్యార్థుల డిమాండ్‌ను మన్నించి కొన్ని మంచి ఆధునిక నవలలను మీరు అనుమతిస్తే తీసుకొంటాము'' అనేవాడిని మెల్లగా. ''నేను వచ్చి చూడను కాని, నీవు రామమోహనరావు కలసి మంచివి సెల్క్ట్‌చేసి తగుమాత్రంగా తెచ్చుకోండి. అట్టలపైన అసభ్యకరమైన బొమ్మలు లేకుండా చూడండి. మనది కో-ఎడ్యుకేషన్ కాలేజ్, గుర్తుంచుకోండి'' అనేవారు.

ప్రస్తుతకాలంలో వెలువడే వారపత్రికలను, నవలలను లైబ్రరీకి కొనుగోలు చేయడానికి వారు ఒప్పుకోకపోవడంలోని అంతరార్థం ఏమంటే, హింసారిరింసలు ప్రేరేపించే ఈ చెత్త సాహిత్యం చదవడం వలన మన యువత భాషా దారిద్ర్యానికే గాక, భావ దారిద్ర్యానికి కూడా గురౌతున్నారని శ్రీ వై.ఆర్. ఆవేదన వెలిబుచ్చేవారు. ''బయట ప్రపంచంలో మన ఖర్మకొద్దీ సినిమాలు, చెత్త వీక్లీలు, కాలక్షేపం నవలలూ మన పిల్లల్ని చెడగొట్టటానికి ఎలాగూ వున్నాయి. కనీసం మన లైబ్రరీలోనన్నా మంచి వాఙ్మయం సేకరించి విద్యార్థులలో ఉత్తమాభిరుచిని, మానవతా విలువలను ప్రోదిచేసి వారి సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడదాం'' అనేవారు.

## వ్యక్తిగా శ్రీ వై. ఆర్.

### Teetotaller and perfectionist గా

ఏ చెడ్డ అలవాట్లూ లేని వీరు, వ్యక్తిగత పరిశుభ్రతకు చాలా ప్రాధాన్యం ఇచ్చేవారు. చొక్కాపై గుండీలు పెట్టుకోకుండా విద్యార్థులే కాదు, లెక్చరర్లు అయినాసరే వీరి కంటపడితే వూరుకొనేవారు కాదు. సిగరెట్లు త్రాగడమేకాదు, కనీసం ఎవరన్నా వక్కపొడి నములుతూ వారి కంటపడ్డా చీదరించుకునేవారు. పొడుగుచేతుల చొక్కాలు వేసుకొని,

చేతులు పైకి మడచినట్లు కన్పించినా సహించేవారు కాదు. రోడ్డున వెళ్తూంటే అడ్డంగా చిన్నచిన్న రాళ్ళు కన్పిస్తే, వాటిని కాలితో ప్రక్కకు నెట్టేసేవారు. పుస్తకం మూలలు వంగిపోయినా, టేబిల్‌క్లాత్ ముడతలు బడ్డా చూస్తూ వూరుకోలేరు. వాటిని సరిచేస్తేనే గాని వారి మనస్సు హాయిగా వుండేదికాదు. అన్ని విషయాల్లోను వ్రేలెత్తి చూపించుకోకుండా perfectగా వుండటమే వారి సహజ లక్షణం, style కూడా.

## వాత్సల్యం - విద్యార్థులు

కష్టపడి చదువుకొని మంచి మార్కులు తెచ్చుకొనే పేద విద్యార్థులంటే వారికి అమిత వాత్సల్యం. వాళ్ళని ''అరే ఇటు రారా'' అని పిలిచి వాళ్ళ మార్కులు అడిగి తెల్సుకొని సంతోషం కనబరుస్తూ వాళ్ళ వీపులమీద ఆప్యాయతతో ఒక చప్పిడిదెబ్బ కొట్టి కోటు జేబులోనుంచి చాక్‌లెట్స్ తీసి ఇవ్వడం ఆయనకు అలవాటు. వాళ్ళతో ''ఒరే ప్రొద్దున్నే లేచి చద్దన్నం తిని బాగా చదువుకోవాలి, తెల్సిందా! కాఫీలు గట్రా త్రాగడం, మాట్నీ సినిమాలకు చెక్కేయ్యడం మానేయండి'' అని సలహా ఇచ్చేవారు.

## సంగీత, సాహిత్య ప్రియత్వం

శాస్త్రీయ కర్ణాటక సంగీతమంటే చెవికోసుకొనేవారు. అందులోను బాలమురళీకృష్ణ, సుబ్బులక్ష్మి గార్ల గాత్ర సంగీతమంటే మరీను. మా కళాశాలలో అప్పట్లో వైస్ ప్రిన్సిపల్‌గా వున్న డా॥ ఎస్. అనంతం గారి గొంతు చాలా గంభీరంగా, వినసొంపుగా వుండేది. వారి వాయిస్ మెచ్చుకొంటూ ''అనంతం గారికి సంగీతం వస్తే, బంగారానికి తావి అబ్బినట్లు వుండేది'' అని అంటూండేవారు. కళాశాల ఉత్సవాలన్నింటిలోను త్యాగరాయ కీర్తనలు లేదా శాస్త్రీయ సంగీతం వినిపించాల్సిందే. లలిత సంగీతం గాని, సినిమా పాటలు గాని వినిపించడానికి వీలులేదు.

ఇక సాహిత్య విషయానికొస్తే వారి దృష్టిలో ఆంగ్ల సాహిత్యరంగంలో మిల్టన్ ముందు షేక్స్పియర్ దిగదుడుపే. ఆయన

గద్యం కంటే పద్యాన్నే ఎక్కువగా అభిమానించేవారు. భావ, అభ్యుదయ, దిగంబర కవిత్వాలంటే వారికి కంపరంగా వుండేది. వచన కవిత్వం అంటే ఏవగింపు. అయితే 'ఎంకిపాటలు' మాత్రం నచ్చేవి. పాపయ్య శాస్త్రిగారి కవిత్వం కంటే శ్రీ జాషువా కవిత్వాన్ని బాగా ఆస్వాదించేవారు. భర్తృహరి సుభాషితాలు, జయదేవుని గీతగోవిందం నుంచి అనేక quotations చెప్తుండేవారు. ఇలా చెప్తూ ''నాకంటే శాస్త్రికి మంచి జ్ఞాపకశక్తి వుంది. ఆయనది elephantine memory'' అనేవారు. శాస్త్రిగారంటే, డా॥ సి.యస్. శాస్త్రి అన్నమాట. వీరు డా॥ అమరేంద్రగా ప్రసిద్ధులు. అప్పట్లో మా కళాశాలలో ఆంగ్లభాషా శాఖకు అధ్యక్షులుగా వుండేవారు. వీరు మంచి టీచరేకాదు, గొప్ప రచయిత, మహోపన్యాసకులు, విశిష్ట అనువాదకులు కూడా. తన మధుర, గంభీర ఉపన్యాసాలతో డా॥ అమరేంద్ర ప్రేక్షకులను, విద్యార్థులను కూడా మంత్రముగ్ధుల్ని చేసేవారు. వీరు శ్రీ రోశయ్యగారి శిష్యులు. శిష్యుడైనంత మాత్రాన డా॥ అమరేంద్ర ఎప్పుడన్నా క్లాసులకు ఆలస్యంగా వెళ్ళినా, లేదా అనుమతి లేకుండా వదిలివేసినా శ్రీ వై.ఆర్. వూరుకునేవారు కాదు. ఆయనకు కూడా మెమో ఇచ్చేవారు. రోశయ్యగారిలోని ప్రత్యేకతే ఇది.

## కృష్ణయ్య చౌదరిగారు

శ్రీ పాములపాటి వేంకట కృష్ణయ్య చౌదరి (పి.వి.కె.) గారంటే శ్రీ రోశయ్య గారికి చాలా అభిమానం. శ్రీ కృష్ణయ్య చౌదరి మంచి సాహసి, తెంపరి, మొనగాడు, పరిపాలనాదక్షుడు, స్కూల్లోచేరి చదువుకొంది థర్డ్‌ఫారమే అయినా, ఇంగ్లీషు దర్జాగా, ధారాళంగా ఇంగ్లీషువాళ్ళతో సమానంగా మాట్లాడేవారని గర్వంగా, ఉప్పొంగిపోతూ చెప్పేవారు. కృష్ణయ్య చౌదరిగారు జమీందారీల పార్టీ అయిన జస్టిస్ పార్టీకి చెందినవారు. రోశయ్యగారు రాయిస్టు. ఒకింత సోషలిస్టు భావాలు కలిగిన లిబరలిస్టు అనవచ్చు. అయినా రోశయ్య గారికి కృష్ణయ్య చౌదరి గారంటే వల్లమాలిన ప్రేమ, ఆకర్షణ. నాకు కృష్ణయ్య చౌదరిగారు దగ్గరి బంధువు.

నా సమక్షంలోనే శ్రీ వై.ఆర్., మా ఆఫీసు సూపరింటెండెంట్ శ్రీ చతుర్వేదుల కోటయ్య కలిసి, కృష్ణయ్య చౌదరిగారు సాధించిన అనేక విజయాలను గుర్తుచేసుకొంటూ సంభ్రమాశ్చర్యాలను ప్రకటించేవారు. ఒకసారి గుంటూరు ఆఫీసర్స్ క్లబ్‌లో తెల్ల జాతీయుడైన డి.ఎస్.పి.తో ఏదో మాటామాటా వచ్చి కృష్ణయ్య చౌదరిగారు ఆ డి.ఎస్.పి.ని తన షూతో కొట్టాడని నోటిమీద చేయివేసుకొని అనేకసార్లు అబ్బురంగా చెప్పుకొనేవారు. బ్రిటిష్ ఇండియాలో ఒక ఇంగ్లీషువాడిని, అందులో జిల్లా పోలీసు అధికారిని ఒక నల్లవాడు చెప్పుతో కొట్టడమంటే సామాన్యమైన విషయం కాదు.

అంతేగాదు చౌదరిగారు జిల్లా బోర్డు అధ్యక్షులుగా వున్నప్పుడు, గుంటూరు జిల్లాలో పెద్దసంఖ్యలో హైస్కూళ్ళు స్థాపించి, అప్పట్లో మద్రాసు ప్రావిన్సు మొత్తంమీద మా గుంటూరు జిల్లాలోనే ఎక్కువ సంఖ్యలో హైస్కూళ్ళు పనిచేస్తున్నట్లు రికార్డు స్థాపించారు అని కూడా రోశయ్యగారు గర్వంగా చెప్పేవారు.

ఒకసారి మద్రాసు ప్రావిన్స్ ముఖ్యమంత్రి అయిన కాంగ్రెస్ వ్యక్తి ఒకరు (పేరు గుర్తుకు రావడంలేదు) మధురైలో జస్టిస్ పార్టీకి వ్యతిరేకంగా మంచి రక్షణలో సభ జరిపారు. అప్పుడు చౌదరిగారు నిడుబ్రోలు నుంచి జనాన్ని ప్రోగుచేసి ట్రెయిన్‌లో రెండు బోగీలనిండా వారిని తీసుకొనివెళ్ళి ఆ సభను భగ్నం చేసి తన సత్తా చాటుకొన్నారని, ఉద్రేకంతో ఊగిపోతూ శ్రీ వై.ఆర్. చెప్పేవారు.

అప్పట్లో గుంటూరు జిల్లాలో, జిల్లా బోర్డు రాజకీయాల్లో శ్రీ జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి, శ్రీ కృష్ణయ్య చౌదరి ప్రత్యర్థులుగా వుండేవారు. అప్పటి గుంటూరు జిల్లా రాజకీయాలకు సంబంధించినంతవరకు మాత్రం శ్రీ వై.ఆర్., శ్రీ కుప్పుస్వామిగారి కంటే శ్రీ కృష్ణయ్య చౌదరి గారికే మద్దతు పలికేవారు. ''కుప్పుస్వామిగారు మంచి పెద్దమనిషి. అయితే కృష్ణయ్య చౌదరి గుండె

కలవాడు. అనుకొన్నది సాధిస్తాడు'' అని గర్వం తొణికిసలాడే స్వరంతో రోశయ్యగారు చెప్పేవారు. కృష్ణయ్య చౌదరిగారు అప్పట్లో కమిషన్ కోసం గుంటూరులో మిలటరీ సెంటర్ రన్‌చేసి, సైనికుల్ని తయారుచేసి తర్ఫీదు ఇచ్చి బ్రిటిష్ ప్రభుత్వానికి సప్లై చేయడం శ్రీ వై.ఆర్.కు నచ్చేదికాదు. అయితే చౌదరి గారికి బిరుదు లభించినందుకు మాత్రం సంతోషం వెలిబుచ్చేవారు. ఒక్కమాటలో చెప్పాలంటే శ్రీ వై.ఆర్., శ్రీ చౌదరి గారికి మంచి ఫాన్ అనిపిస్తుంది. చౌదరి గారిని అందరూ పి.వి.కె. అని సంబోధించేవారు. వారిమీద మక్కువతో, నేను వారి దగ్గరి బంధువు కావడంతో, నాinitials కూడా పి.వి.కె. కావడంతో, నన్ను కూడా రోశయ్యగారు 'పి.వి.కె.' అని పిలుస్తూ వుండేవారు.

## పుస్తకాలపై underline చేయడం-
## తెలియని విషయాలపై ఆసక్తి

వీరు క్రమం తప్పకుండా చదివే పత్రికలలో Hindu, Times Literary Supplement, బాబూరావ్ పటేల్ సంపాదకత్వంలో వెలువడే Mother India, భారతి మొదలగునవి ముఖ్యమైనవి. శ్రీ బాబూరావ్ పటేల్ నాన్‌మెట్రిక్యులేట్ అయినా కూడా పత్రికలో వారి సంపాదకీయాలు, ప్రశ్నలు - సమాధానాలు విభాగం thought provokingగాను, ఆసక్తికరంగాను వుంటాయని మెచ్చుకొనేవారు. బాబూరావ్‌పటేల్ సంపాదకీయాల్లో కూడా అక్కడక్కడా దొర్లే వ్యాకరణ తప్పిదాలను ఎర్ర పెన్సిల్‌తో అండర్‌లైన్ చేసి ప్రశ్నార్థక, ఆశ్చర్యార్థక గుర్తులు పెట్టేవారు. శ్రీ రోశయ్యగారు తెలుగు దినపత్రికలను అన్నింటినీ ఇంటివద్ద చదివేవారు. వాటి సంపాదకీయాలు, వార్తా శీర్షికల్లోని దోషాలను ఎర్రరంగు పెన్సిల్‌తో అండర్‌లైన్ చేయడం వీరికి అలవాటు. ఇదే అలవాటుతో అప్పుడప్పుడూ లైబ్రరీ పుస్తకాల మీదకూడా మామూలు పెన్సిల్‌తో చాలా తేలిగ్గా అండర్‌లైన్ చేయడం లేదా కామెంట్స్ క్లుప్తంగా రాయడం జరిగేది. వాటిని లైబ్రరీకి రిటర్న్

చేసేటప్పుడు మాత్రం మా లైబ్రరీ సిబ్బందిని పిలిచి ఆ గుర్తులన్నీ రబ్బరుతో చెరిపి పుస్తకాలను లైబ్రరీకి జమకట్టమనేవారు. ఇలా లైబ్రరీ పుస్తకాలమీద తేలిగ్గానైనా సరే పెన్సిల్‌తో గుర్తులు పెట్టవద్దని వారికి చెప్పే సాహసం నేనెప్పుడూ చేయలేదు. అప్పుడప్పుడూ అంటూవుండేవారు ''మంచి పెసరట్టు తినేటప్పుడు పంటిక్రింద రాయిపడితే ఎలా వుంటుందో దోష భూయిష్టమైన వాక్యాలు చదివితే నాకు అలా వుంటుందిరా అబ్బీ'' అని. అంతేకాదు ''నా కళ్ళు పాపిష్టివయ్యా. నేనేం చెయ్యను. చూసీ చూడటంతోనే ఆ తప్పులే నాకంట బడతాయి'' అనేవారు.

రోశయ్య గారిలో ఒక సుగుణం వుండేది. వారికి తెలియని విషయం ఎంత trifling matter అయినాసరే, ఎవరు చెప్పినా ఆఖరుకు మా కళాశాల ప్యూన్ వెంకట్రావు చెబుతున్నా శ్రద్ధగా వినేవారు. ఒకానొక సందర్భంలో రోశయ్యగారి సమక్షంలో ''అభినందన సంచిక'' ప్రస్తావన వచ్చింది. ఇంగ్లీషులో దాన్ని Festschrift అంటారుగదా అన్నాను. ఏంటి మళ్ళీ చెప్పు అని eager గా అడిగారు. ఆమాట ఉచ్చారణలో పొరపాటు ఉందేమోనని భయపడుతూ స్పెల్లింగ్ చెప్పాను. నిజమా అని ఆశ్చర్యపడి, డిక్షనరీ తెప్పించి రిఫర్ చేసి, ఆమాట తనకి తెలియదని ఇప్పుడే విన్నానని నావంక ప్రశంసాపూర్వకంగా చూశారు. వీరు రిటైరు అయిన తరువాత మా లైబ్రరీ అసిస్టెంట్ శ్రీ నిమ్మగడ్డ సుబ్బారావు వారిని అప్పుడప్పుడూ కలిసి, వారికి కావలసిన పుస్తకాలను నా ఖాతాలో రాసి తీసుకెళ్ళి ఇస్తూవుండేవాడు. అప్పటికి వీరి భార్య చనిపోయింది. ''ఒరేయ్ అబ్బీ 60 ఏళ్ళు వయస్సు దాటిన తరువాత ప్రతి మగవాడికీ భార్యతోడు తప్పక వుండాలిరా. అలా లేకపోతే జీవితం దుర్భరంరా'' అని కంటతడిపెట్టేవారట.

## అజ్ఞేయవాది (Agnostic)

మాస్టారు గారిని పూర్తిగా నాస్తికులనలేము. గుళ్ళకు వెళ్ళడం, పూజలు చేయడం లేదు. కాని ఆస్తికుల్ని ఆక్షేపణ చేసేవారుకాదు.

అప్పుడప్పుడూ అనేవారు విద్యార్థులతో ''గురువులైన మాకు సరిగ్గా నమస్కారం పెట్టకపోతే మానె, కనీసం దేవుడి గుడిలోకి వెళ్ళినప్పుడైనా శ్రద్ధతో తలవంచి రెండుచేతులు ఎత్తి శిరస్సుపెట్టి ఆ పరమాత్ముడికి నమస్కరించండి'' అని. వీరు పూర్తిగా Atheist కాదుగాని Agnostic ఏమో అనిపిస్తుంది.

## హైకోర్టు నోటీసు-వై.ఆర్. నిజాయితీ

ఒకసారి హైదరాబాదు హైకోర్టు అఫీషియల్ రిసీవర్ నుంచి వీరికి ఒక నోటీసు వచ్చింది. గుంటూరులో 1950ల్లో అరండల్‌పేట 3వ లైనులో బుక్ లవర్స్ అనే పుస్తకాల షాపు వుండేది. దాని బిజినెస్ బాగోక మూతపడి, చిక్కులపాలై కోర్టుకెక్కింది. రోశయ్యగారు వందరూపాయల పై చిలుకు పుస్తకం ఒకటి ఆ షాపులో క్రెడిట్ బిల్‌పై తనపేర తీసుకొని పైకం చెల్లించలేదని, వెంటనే ఆ పైకం చెల్లించమంటూ సదరు అఫీషియల్ రిసీవర్ రెండు దశాబ్దాల తరువాత నోటీసు పంపారు. ఇలాంటి లీగల్ వ్యవహారాలు తటస్థించినపుడు శ్రీ వై.ఆర్. నన్నుగాని, శ్రీ ఆవుల మదన్‌మోహన్ (Lecturer, Dept. of English)ను గాని పిలచి సంప్రదించేవారు. కారణం మేమిద్దరం పూర్వాశ్రమంలో గుంటూరు జిల్లాకోర్టులో కొంతకాలం అడ్వకేట్స్‌గా ప్రాక్టీసు చేసివుండటమే. ఈ సందర్భంలో రోశయ్యగారు నన్ను పిలిపించి, ఆ నోటీసు నాకిచ్చి చదవమని చెప్పి, తాను ఎప్పుడూ పుస్తకాల షాపుల్లో బాకీ వుంచలేదనీ, బిల్లులో ఉదహరించిన ఈ పుస్తకానికి కూడా తప్పక డబ్బు చెల్లించే వుంటానని గట్టిగా చెప్పారు. Valid Invoice వారిపేర ఉంది కాబట్టి డబ్బు చెల్లించినట్లు మనవద్ద ఆధారాలు కావాలి కాబట్టి, రశీదు కొరకు ఇంటివద్ద వెదకమని చెప్పాను. ఒకవేళ ఆ పుస్తకం ఇంకా వారివద్దే వుంటే దాంట్లోనే రశీదు కూడా వుండొచ్చు, వెదకమన్నాను. నేను తలచినట్లే మరునాడు వారి స్వంత లైబ్రరీలో ఇంటివద్ద ఆ పుస్తకం దొరకడం, దాంట్లోనే ఆ రశీదు కూడా లభించడం వలన వారు చాలా సంతోషించారు. మరునాడు ఆ రశీదు జిరాక్స్ కాపీ తీయించి, అఫీషియల్

రిసీవర్‌కు ఒక లెటర్ డ్రాఫ్ట్ చేసి దాంతోపాటు రశీదు కాపీని జతపరచి రిజిస్టర్ పోస్ట్‌లో పంపాము. అంతటితో ఆ వ్యవహారం ముగిసింది.

## ముగింపు

శ్రీ వై.ఆర్. అనగానే మానవతా విలువలు రూపుగట్టిన గతకాలపు ఒక గొప్ప కమిటెడ్ టీచర్ మనకళ్ళముందు సాక్షాత్కరిస్తారు. ఈయన గొప్ప disciplinarian మాత్రమేకాదు; a great connoisseur; a rare litterateur and a scholar extraordinary కూడా. మనిషి, మనీషి అనిపించుకోవాలంటే తప్పకుండా ప్రతివాడు ప్రపంచ సాహిత్య, చరిత్రలను లోతుగా అధ్యయనం చేయాలని చెప్పేవారు. ఆయన సన్నిధిలో మాబోటివారంతా విద్యార్థులుగా మారి ప్రతినిత్యం ఏదోఒక కొత్త విషయం తెలుసుకునేవాళ్ళం. ఆయనతో సంభాషించడమే ఒక గొప్ప ఎడ్యుకేషన్‌గా భావించేవాళ్ళం. అనేక సాహిత్య మర్మాలనే గాక, జీవితపు లోతుల్ని కూడా మాకు ఎరుకపరచేవారు. He was not only a great-bibliophile but also an avid bibliomaniac.

మంచి పుస్తకాలను తాను మాత్రమే చదవడం కాక తనచుట్టూ వున్నవారిని కూడా చదవమని ప్రోత్సహించేవారు. అందులోను హాస్యరసభరితమైన రచనలంటే మరీ ముచ్చటపడేవారు. అందులోని హాస్యస్ఫోరక వాక్యాలను మాటిమాటికి చదివి, ప్రక్కన వున్నవారికి కూడా చదివి వినిపించి కడుపార నవ్వుకునేవారు. ఆ నవ్వులో పసిపిల్లల అమాయకత్వం వెల్లివిరిసేది.

Duty is divine అని నమ్మేవారిలో వీరు ఒకరు. అతి శుభ్రత, అనన్య క్రమశిక్షణ, అనంత సాహిత్య తృష్ణ, అవిరళ జిజ్ఞాస, అసదృశమైన వ్యాకరణ కుశలత, అచిరమైన పాలపొంగులాంటి ముక్కోపితనం, ఆవగింజంత ఛాదస్తం, అక్కజమైన ఆర్ద్రత, అతిశయించిన మానవీయత అన్నీ కలిస్తేనే మా మేష్టారు రోశయ్యగారు. చదువుల తల్లి ముద్దుబిడ్డ అయిన రోశయ్యగారు శాశ్వతంగా కనుమరుగవడంతో ఆంగ్లాంధ్ర సాహిత్యలోకం చిన్నబోయింది.